క్లుప్తంగా

వెండి చెంబు బహుకరణ



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ వారికి ఆదివారం తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, సరెడ్డిగూడెం గ్రామానికి చెందిన యడవల్లి సైదులు, నాగమణి దంపతులు 152 గ్రాముల వెండి చెంబును బహూకరించారు. వెండి చెంబును ఆలయ ఈఓ కిషోర్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

12 నుంచి వత్సవాయమ్మ తిరునాళ్ల



వత్సవాయి: శ్రీరామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ తల్లి తిరునాళ్లను ఈనెల 12 నుంచి 17వతేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. 12న బుధవారం రాత్రి అమ్మవారి తిరుకల్యాణం, 13న దీక్షాస్వాములు ఇరుముడి సమర్పణ, అమ్మవారు నిధిఎక్కుట, 14 న మధ్యాహ్నం జలబిందెలు, రాత్రి అంకసేవ, 15న లగుడు పొడుచుట, రాత్రికి పూలకప్పెర ఊరేగింపు, 16న పొరుగూరి బోనాలు, గ్రామరాశి ప్రభ ఊరేగింపు, చివరిరోజు 17న ఉన్న ఊరి బోనాలు రాత్రికి దీవెన బండారు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. తిరునాళ్ల సందర్భంగా రోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

నాయకులకు మాజీఎమ్మెల్యే పరామర్శ



చందర్లపాడు(నందిగామటౌన్): చందర్లపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యరగొర్ల రాజు, కడియం సీతారామయ్యలను మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆదివారం రాత్రి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. త్వరలోనే కోలుకుని పార్టీ కార్యక్రమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, బుగ్గినేని సురేష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి



జగ్గయ్యపేటఅర్బన్: బాలికలకు సౌకర్యవంతంగా ఉండేల బలుసుపాడు రోడ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల వరకు వీధిలైట్లు ఏర్పాటుచేయాలని మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఉక్కుకళావేదికలోని మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను కలిసి వినతిపత్రం అందజేశారు. జగ్గయ్యపేట పట్టణానికి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో 600 మంది బాలికలు చదువుతున్నారన్నారు. స్టడీ క్లాసులు కోసం రాత్రి వేళల్లో మహిళా ఉపాధ్యాయులు, పిల్లల కోసం తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తున్నందున వారికి ఇబ్బందులు లేకుండా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

50మందికి కంటి పరీక్షలు



చందర్లపాడు(నందిగామ రూరల్): మండలంలోని పున్నవల్లి గ్రామంలో జగ్గయ్యపేటకు చెందిన డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది 50 మందికి ఉచితం కంటి పరీక్షలు చేశారు. ఎక్కువ మంది దగ్గరి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామని ఆప్తమాలజిస్ట్ సయ్యద్ గణీసావలి తెలిపారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన సర్పంచి కోట మోహనరావు మాట్లాడుతూ పేదల కోసం ఇటువంటి వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం హర్షనీయమంటూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌గాటంతో నష్టం

- కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు
- 17 నుంచి టెన్త్ పరీక్షలు
- ఫేస్‌బుక్, యూట్యూబ్‌లతో సమయం వృథా
- నిద్రలేమి, కంటి జబ్బులు, మానసిక రుగ్మతలు
- విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలంటూ విశ్లేషకుల సూచన



కంచికచర్ల: సామాజిక మాధ్యమం రెండు వైపులా పదునైన కత్తిలాంటిది. ఆశయం దిశగా సాగితే విజ్ఞానం, వినోదం ఉంటాయి. ఏమాత్రం గురితప్పినా జీవితం తారుమారవుతుంది. యువత మార్కెట్‌లోకి ఏ ట్రెండ్ వచ్చినా అందిపుచ్చుకుంటుంది. వాటిని అనుసరిస్తుంది. ఫేస్‌బుక్‌లో లైకులు, కామెంట్లు, వాట్సప్‌లో స్టేటస్‌లు ఇలా...ఊహల గగనంలో విహరిస్తోంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతుండగా, ఈనెల 17వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు జరుగనున్నాయి. ఇలాంటి సమయాల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని వైద్యులు, సామాజిక శాస్త్రవేత్తలు సూచించారు. సామాజిక మాధ్యమాలను వినియోగిస్తూ ఉంటే భవిష్యత్ పక్కదారి పట్టే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తత అవసరం...

ఫేస్‌బుక్ పేరు వింటేనే అందరిలో ఉత్సాహం మొదలవుతుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఫేస్‌బుక్ దగ్గరయింది. యువత విషయంలో చెప్పాల్సిన అవసరంలేదు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఫేస్‌బుక్, వాట్సప్, యూ ట్యూబ్ ఎక్కువయితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరు. ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోకపోతే మొదటికే మోసం వచ్చే పరిస్థితి ఉంది. అందువలన విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, వారిని సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చేసేలా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

పరిమితి దాటితే ప్రమాదమే...

సామాజిక మాధ్యమాలను రోజుకు 30నిముషాలకు మించి వినియోగిస్తే ఇబ్బందులు లేవని వైద్యులు అంటున్నారు. కాని చాలామంది గంటల తరబడి ఇందులోనే గడుపుతుంటారు. ప్రతిరోజూ వాటిని వినియోగించే విద్యార్థులు పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలోనూ ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నారు. అలాంటివారు తమకు తామే ఓ పరీక్ష పెట్టుకోవాలని వైద్యులు, ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రతి పదినిముషాలకు ఒకసారి ఫోన్ వైపుకు చేయి వెళ్తుందా... ఫేస్‌బుక్, యూట్యూబ్ వాట్సప్ చూడాలనిపిస్తుందా...అనే విషయాలు తమను తామే ప్రశ్నించుకోవాలి. పరిస్థితి చేయి దాటినట్లు భావిస్తే...వారం పదిరోజులు వాటికి దూరంగా ఉండేటట్లు ప్రయత్నించాలి. ఇలా ఉండగలిగితే నియంత్రణలో ఉన్నట్లే లెక్క. ఉండకపోతే వాటికి బానిస అయినట్లేనని మానసిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

మానసిక రుగ్మతలు...

ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాలకు అలవాటు పడితే మానసిక రుగ్మతలు వస్తాయని పలువురు అంటున్నారు. ప్రస్తుతం చాలామందికి సెల్‌ఫోన్ ఒక వ్యసనంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం రీల్స్ పేరుతో వీడియోలు పోస్టు చేయడంతో కామెంట్లు లైకులు వస్తే ఆనందపడటం, వ్యతిరేకంగా కామెంట్లు చేస్తే బాధకు లోనవుతున్న వారి సంఖ్య కూడా రోజురోజుకు పెరిగిపోతోంది. రోజులో కొద్ది సమయం తప్పితే అదేపనిగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే కంటి సమస్యలు, మానసిక రుగ్మతలు తప్పవని వైద్యులు అంటున్నారు. ఇకనైనా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి ఈ పరీక్షా కాలంలో విద్యార్థులకు సెల్‌ఫోన్ అందుబాటులో లేకుండా చూడాలని వైద్యులు సూచిస్తున్నారు.

కంటిచూపుపై ప్రభావం...



ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలను వినియోగిస్తే కంటిచూపుపై ప్రభావం పడుతుంది. దీనివలన రెటీనా పొర దెబ్బతింటుంది. కంటిచూపు మందగించడంతోపాటు ఎముకల సమస్యలు వస్తాయి. ఆరోగ్యం క్షీణిస్తుంది. సెల్‌ఫోన్ అతి వినియోగం మంచిదికాదు.

కె.మధురిమ, వైద్యులు, పీహెచ్‌సీ, కంచికచర్ల

సమయం వృథా చేయవద్దు...



విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటుపడటంతో చదువులు పక్కదారి పడుతున్నాయి. పదోతరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ఈ విషయంలో ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

కె.రామకృష్ణ , హెచ్‌ఎం, జెడ్పీహైస్కూల్, గండేపల్లి

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ప్లాట్లు ఇవ్వకపోవడంపై సీపీఎం ఆందోళన



జీ+3 నిర్మాణాల వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నందిగామటౌన్:ఇళ్లులేని నిరుపేదలకు జీ+3 నిర్మాణాలు చేపట్టి ఇళ్లు ఇస్తామంటూ డిపాజిట్లు వసూలు చేసిన టీడీపీ ప్రభుత్వం పదేళ్లవుతున్నా నేటికీ లబ్ధిదారులకు ఇళ్లు అందించలేదని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం పట్టణ శివారు హనుమంతుపాలెం వద్దనున్న జీ+3 నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్లాట్లు ఇస్తామంటూ డిపాజిట్‌లు వసూలు చేసి పదేళ్లవుతున్నా నేటికీ ప్లాట్లు అప్పగించకపోవడం దారుణమన్నారు. కనీసం ఆయా డిపాజిట్లయినా తిరిగి ఇవ్వాలని లబ్ధిదారులు అడుగుతుండగా, మున్సిపల్ అధికారుల నుంచి స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల నుంచి డీడీల రూపంలో డిపాజిట్లు సేకరించడమే కాకుండా వారి పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని లబ్ధిదారులను మోసం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిపాజిట్ చేసిన వారికి జీ+3 ప్లాట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాశీం, కర్రి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, హుసేన్, లాజరు తదితరులు పాల్గొన్నారు.

వీసీగా ప్రకాష్‌బాబు నియామకంపై హర్షం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట వాసి, స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల పూర్వవిద్యార్థి ప్రొఫెసర్ పణితి ప్రకాష్‌బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులుకావడంపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెలరోజుల కిందట ఇటీవల కడప యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియామితులైన ప్రకాష్‌బాబు తాజాగా పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులవ్వడం ద్వారా జగ్గయ్యపేట ప్రతిష్టను మరింత ఇనుమడింజేశారని ఆయన మిత్రులు కొనియాడారు. ప్రకాష్‌బాబు నియామకంపై ఎస్‌జీఎస్ కళాశాల యాజమాన్య ప్రతినిధులతోపాటు ఏవో కె.సత్యనారాయణరావు, విశ్రాంత ప్రిన్సిపాల్స్ ఎస్‌వీవీ. సత్యనారాయణ, జీడీవీ.ప్రసాద్, ఈశ్వరయ్యశెట్టి, అబ్బాస్ ఆలీ, వై.అంకయ్య, పణితి రవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తంచేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న యల్లా జోస్యుల అనూరాధ బృందం

విజయవాడకల్చరల్: విప్ర వ్యాపార సాధికారిక సంస్థ, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బిగ్ బిజినెస్ వ్యాపార ప్రమోషన్ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నాట్యాచారిణి యల్లా జోస్యుల అనూరాధ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించింది. గణపతి ప్రార్థనతో ప్రారంభించి అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు దమ్మాలపాటి లీలా ప్రసాద్, పిల్లల మర్రి సునీల్, ఉప్పులూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామ టౌన్: నేర చరిత్ర కలిగిన వారు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సీఐ వైవీఎల్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: గంపలగూడెం మండలం కనుమూరు గ్రామ శివారులో సారా బట్టీపై తిరువూరు ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి నిర్వహించారు. బట్టీ సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు జరిపే వారిపై పీడీ చట్టం నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామరూరల్: గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు కాపా రామ సీతమ్మ ఆధ్వర్యంలో వారి కుమారులు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపాలెంలో కాపా కుటుంబ సభ్యుల సహకారంతో రూ.మూడు లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ తల్లి మాట ప్రకారం కాపా కుటుంబసభ్యులు గ్రామాభివృద్ధికి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రామసీతమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపా కృష్ణ ప్రసాద్, కాపా రవీంద్రనాథ్, కాపా భానుప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్టా మహోత్సవాలు



క్షీరాధివాసంలో పాల్గొన్న భక్తులు

మక్కపేట(వత్సవాయి): శ్రీపార్వతీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీగంగమ్మ తల్లి నూతన ఆలయాల ప్రతిష్టామహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వార్ల విగ్రహాలకు క్షీరాధివాసం, ధాన్యాధివాసం, జలాధివాసం కార్యక్రమాలను వేదపండితులు యలమంచిలి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ధ్వజస్తంభంతోపాటు సహదేవతల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. దేవదాయశాఖ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు, సర్పంచ్ మల్లెల శివప్రసాద్, మాజీ సొసైటీ అధ్యక్షులు కనగాల రమేష్, కొండబోలు బ్రహ్మం, అర్చకులు కేవైఎస్ శర్మ, యుగంధర్‌శర్మ, సంగయ్యశర్మ, హనుమంతురావు శర్మ, గ్రామ పురోహితులు రాఘవశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలు సాగకుండా చర్యలు



కంచికచర్ల: కంచికచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అఫ్రపునీసాబేగం ఆదివారం హెచ్చరించారు. కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ పరిధిలో ఉన్న 38 గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా కేసు నమోదు తప్పదన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు మొత్తం 61 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 1,163 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు మూడు వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. అన్ని గ్రామాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ మద్యం అక్రమ విక్రయాలు సాగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీఐ వివరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వినతి



ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జగ్గయ్యపేట అర్బన్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గృహ నిర్మాణ సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభానును కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ హౌసింగ్ కార్పొరేషన్‌ను స్థాపించినప్పటి నుంచి చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామన్నారు. 18 ఏళ్లుగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈవోలు, ఐటీ మేనేజర్లు, ఇతర క్యాడర్లలో రాష్ట్రవ్యాప్తంగా 2,600 సిబ్బంది ఔట్ సోర్సింగ్ విధానంలో అతి తక్కువ జీతాలతో నేటికీ రూ.16,411 జీతంతో జీవనం సాగిస్తున్నామన్నారు. వెళ్లదీస్తున్నామన్నారు.తమను హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులుగా గుర్తించి మా బాధ్యతలు మాకు ఇప్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఇంటింటికి తాగునీరు అందించడమే లక్ష్యం

జగ్గయ్యపేటఅర్బన్:పట్టణంలో ప్రతి ఇంటికి త్రాగునీరందించాలన్నదే తమ సంకల్పమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే హెడ్‌వాటర్ వర్క్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 60 హెచ్‌పీ మోటార్‌ను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన 60 హెచ్‌పీ, 40 హెచ్‌పీ మోటర్లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మోటార్ ద్వారా రోజూ పట్టణ ప్రజలకు 30 లక్షల లీటర్ల మంచినీటిని అందించే అవకాశం ఉందని వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త, పాత మోటార్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, సంగెపు బుజ్జిబాబు, వెంకట్, ఇర్రి నరసింహారావు, సైదేశ్వరరావు, నాయకులు మైనేని రాధా, కర్ల జోజి, కటికల అనిల్, సయ్యద్ అన్వర్, మెడక కోటేశ్వరరావు, గింజుపల్లి కృష్ణ, మున్సిపల్ అధికారులు, ఇంజిరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కాలే షా, పాఠశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు ఎస్‌వీవీ.సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీరాం బదరీనారాయణ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు కష్టపడి చదవాలన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ మొరిశెట్టి రంగారావు, కోశాధికారి అత్తులూరి జగన్నాధరావు, కమిటీ మెంబర్ కూనపరెడ్డి సత్యనారాయణరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కేటీ ఆచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనులపండువగా రామకోటి మహోత్సవాలు



సీతారామచంద్ర స్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నందిగామ రూరల్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామకోటి మహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో సీతారామచంద్ర స్వామి వారి కలాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన కులేలోపాఖ్యానం, భక్తి సంకీర్తనలు, కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీతారామనామ సంకీర్తనా సంఘ సభ్యులు, అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజాచార్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు అందజేయవచ్చని వివరించారు. ఆయా అర్జీలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.